క్లుప్తంగా

కొనసాగిన కుల గణన సర్వే



సర్వే బృందానికి సూచనలు ఇస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు

గుత్తి: కుల గణన సర్వే గుత్తి మున్సిపాలిటీ పరిధిలో సోమవారం కొనసాగింది. కమిషనర్ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్ బీలు కుల గణన సర్వేను పర్యవేక్షించారు. సచివాలయ ఉద్యోగులు, వార్డు వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు నమోదు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ సర్వే పకడ్బందీగా, తప్పులు లేకుండా చేపట్టాలని సూచించారు.

వార్డుల్లో పర్యటించిన కమిషనర్

గుత్తి: మున్సిపాలిటీ కమిషనర్ శ్రీనివాసులు సోమవారం పట్టణంలోని 14,15,16వ వార్డుల్లో పర్యటించారు. డ్రైనేజీ, తాగునీటి సమస్యలపై ఆరా తీశారు. మురుగు కాలువలను తరచూ శుభ్రం చేయించాలని, చెత్తాచెదారం ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఈ క్రాప్ నమోదు పరిశీలన



శిరివరంలో ఈ క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ రవి

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా రబీలో పంటలు సాగుచేసిన రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని ఏడీఏ రవి పేర్కొన్నారు. శిరివరం, కనంపల్లిలో జరుగుతున్న ఈక్రాప్ పంట నమోదును సోమవారం ఆయన పరిశీలించారు. మండల వ్యాప్తంగా 90 శాతం(1800 ఎకరాల్లో) ఈ క్రాప్, ఈకేవైసీ పూర్తి చేశారన్నారు. మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ పాల్గొన్నారు.

విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట



ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఫయాజ్‌బాషా

తాడిపత్రి అర్బన్: సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి పెద్ద పీట వేశారని వైఎస్సార్‌సీపీ నాయకుడు, 2వ వార్డు కౌన్సిలర్ హీరాపురం ఫయాజ్‌బాష పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని 11వ వార్డులోని మున్సిపల్ ఉర్దూ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఎంఈఓ నాగరాజు, హెచ్‌ఎం హాషంమియా పాల్గొన్నారు.

సీపీఎం ధర్నా

గుంతకల్లు రూరల్: పంట నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం అందించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. జిల్లా నాయకుడు బీ.శ్రీనివాసులు మాట్లాడుతూ ఎకరాకు రూ.50 వేలు నష్టపరిహారం అందించాలని, ఉపాధి కూలీలకు 200 రోజులు పనిదినాలు కల్పించాలని, పట్టణాల్లోనూ ఉపాధి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

ఈవీఎంలపై అవగాహన



ఈవీఎం పనితీరుపై అవగాహన కల్పిస్తున్న శ్యాం సుందర్‌రెడ్డి

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని నీలాంపల్లి, జంతలూరు, చెదుల్ల, రెడ్డిపల్లి, రోటరీపురం, కొర్రపాడు, నీలారెడ్డిపల్లి గ్రామాల్లో ఈవీఎంలపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెక్టార్ అధికారి, ఏఓ శ్యాం సుందర్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల దృష్ట్యా ఓటింగ్ యంత్రాలపై ఓటర్లు అవగాహన పొందాలన్నారు. కంట్రోల్ బ్యాలెట్, వీవీ ప్యాట్‌లతో ప్రజలకు అవగాహన కల్పించారు. వీఆర్‌ఓలు వెంకట నారాయణ, శ్రీనివాసరెడ్డి, శంకరయ్య, సచివాలయ పోలీసు కార్యదర్శి శైలజ, స్వప్న, బీఎల్‌ఓలు రాజారెడ్డి, నగేష్, ఓబిలేసు పాల్గొన్నారు.

గొడవలకు దూరంగా ఉండండి



మాట్లాడుతున్న సీఐ నాగార్జున రెడ్డి

యాడికి: గ్రామాల్లో ఎలాంటి గొడవలకు తావు లేకుండా ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా జీవించాలని యాడికి సీఐ నాగార్జున రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని వెంగన్నపల్లెలో సీఐ గ్రామ సభ నిర్వహించారు. ఎన్నికలు సమీపిస్తున్నందున ఎవరైనా చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. గ్రామాల్లో పేకాట, మట్కా జోలికెళ్లినా చర్యలు తప్పవన్నారు.

ప్రతిభ వెలికితీతకే ‘ఆడుదాం ఆంధ్రా’







క్రికెట్, ఖోఖో పోటీల్లో విజేతలుగా నిలిచిన గుంతకల్లు జట్లకు ట్రోఫీ అందజేస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమున్, ట్రోఫీతో తాడిపత్రి సుంకులమ్మపాలెం జట్టు

• ముగిసిన నియోజకవర్గ స్థాయి పోటీలు

గుంతకల్లు: గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసి వారు జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించేందుకే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని గుంతకల్లు ఆర్డీఓ వాకా శ్రీనివాసులురెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమున్ అన్నారు. ఆడుదాం ఆంధ్రాలో భాగంగా 35 రోజులుగా స్థానిక రైల్వే క్రీడామైదనంలో గ్రామ, వార్డు సచివాలయ, మండల, నియోజకవర్గ స్థాయిలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బాడ్మింటన్, ఖోఖో పోటీలు నిర్వహిస్తున్నారు. సోమవారం నియోజకవర్గ స్థాయి పోటీలు ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆర్డీఓ, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లతోపాటు, కమిషనర్ వెంకటరమణయ్య, తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటరమణ, ఎంఈఓలు మస్తాన్ రావు, సుబ్బరాయుడు హాజరై మాట్లాడారు. క్రీడా పోటీల్లో పాల్గొనడం ద్వారా స్నేహ బంధాలు బలపడటంతోపాటు ఆరోగ్యవంతులుగా తయారవుతారన్నారు. గెలుపు ఓటములు సమానంగా తీసుకున్నప్పుడు రాబోవు కాలంలో ఒడిదుడుకులను ఎదుర్కొని రాణిస్తారని సూచించారు. రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో రాణించి గుంతకల్లుకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని క్రీడాకారులకు పిలుపునిచ్చారు.

ఓవరాల్‌గా రాణించిన గుంతకల్లు

గుంతకల్లు క్రీడాకారులు క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బాల్‌బాడ్మింటన్, ఖోఖో పోటీల్లో రాణించి తొలిస్థానంలో నిలిచారు. క్రికెట్ పోటీల్లో పురుషుల విభాగంలో తొలి స్థానంలో గుంతకల్లు, రెండవ స్థానంలో పామిడి, మూడవ స్థానంలో గుత్తి జట్టు నిలిచాయి. అదేవిధంగా మహిళల విభాగంలో తొలి స్థానంలో పామిడి జట్టు నిలిచింది. మిగిలిన విభాగాల్లో కూడా గుంతకల్లు క్రీడాకారులు రాణించారు. విజేత జట్లకు మెడల్‌లతోపాటు కప్‌లను అందజేశారు. ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ కో ఆర్డినేటర్ సబిత, మండల కోఆర్డినేటర్ వేణుగోపాల్, పీడీలు సత్యనారాయణ పాల్గొన్నారు.

తాడిపత్రి సుంకులమ్మపాలెం జట్టు విజేత

తాడిపత్రి అర్బన్: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో క్రికెట్ ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. యాడికి జట్టు, తాడిపత్రి సుంకులమ్మపాలెం జట్లు పోటీ పడ్డాయి. నిర్ణీత 10 ఓవర్లలో తాడిపత్రి సుంకులమ్మపాలెం జట్టు 97 పరుగులు సాధించింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన యాడికి జట్టు 10 ఓవర్లలో 68 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో తాడిపత్రి జట్టును విజేతగా ప్రకటించారు. తాడిపత్రి జట్టులో వినయ్(63),లక్ష్మణ్(25) పరుగులు సాధించారు. విజయం సాధించిన జట్టుకు మున్సిపల్ కమిషనర్ జి.రవి, వార్డు కౌన్సిలర్ ఎం.రంగనాథరెడ్డి రూ.35వేలు నగదుతో పాటు ట్రోఫీ, పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు మెడల్స్ అందజేసి అభినందించారు.

జిల్లా స్థాయికి పలు జట్ల ఎంపిక



శింగనమల: మహిళా జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న డీసీఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి

శింగనమల: శింగనమల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నియోజకవర్గ స్థాయి మహిళా క్రికెట్ పోటీలు జరిగాయి. బుక్కరాయసముద్రం జట్టు విజయం సాధించి జిల్లా స్థాయికి ఎంపికైంది. రన్నరప్‌గా శింగనమల జట్టు నిలిచింది. అదేవిధంగా జిల్లా స్థాయికి పురుషుల క్రికెట్‌లో గార్లదిన్నె జట్టు, కబడ్డీ పోటీల్లో పురుషుల విభాగంలో నార్పల, మహిళా విభాగంలో గార్లదిన్నె జట్లు విజయం సాధించాయి. వాలీబాల్ పోటీల్లో పురుషుల విభాగంలో నార్పల, మహిళా విభాగంలో గార్లదిన్నె, బ్యాడ్మింటన్ పోటీల్లో పురుషుల విభాగంలో గార్లదిన్నె, మహిళా విభాగంలో నార్పల జట్లు విజయం సాధించాయి. ఖోఖోలో పురుషుల విభాగంలో బుక్కరాయసముద్రం, మహిళల విభాగంలో శింగనమల జట్టు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఎంపీడీఓ నిర్మలాకుమారి తెలిపారు. క్రికెట్‌లో గెలుపొందిన మహిళా జట్టుకు డీసీఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి కప్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ యోగేశ్వరి, వైస్ ఎంపీపీ విజయ, ఎంపీటీసీ కురబ ఉమా, పీడీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టండి



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ, ఎంపీడీఓ

పామిడి: సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని సభ్యులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో ఎంపీపీ ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో వైస్ ఎంపీపీ కాయల మహేష్, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు మూలి నాగేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ డీసీ ముత్యాల్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ హయాంలో అర్హులైన పలువురు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు కాలేదన్నారు. పామిడి పెన్నానది నుంచి కర్నూలు జిల్లా వంటి ఇతర ప్రాంతాలకు తాగునీరు సరఫరా అవుతుండడంతో మండలంలో తాగునీటి సమస్య లేకపోలేదన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ఐసీడీఎస్ కింద అంగన్‌వాడీ కేంద్రాలకు జగనన్న కిట్లు సక్రమంగా సరఫరా కావడం లేదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీఓ తరచూ తనిఖీలు నిర్వహిస్తే సమస్యలు కొలిక్కి వస్తాయన్నారు. ఎంపీడీఓ డీ ప్రభాకర్‌నాయక్, అధికారులు పాల్గొన్నారు.

‘బలవంతంగా టీడీపీ కండువాలు కప్పారు’



పట్టణ అధ్యక్షుడు సుంకప్పతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు రసూల్, షేక్ జబీర్‌లు

గుంతకల్లు: తమను మభ్యపెట్టి బలవంతంగా టీడీపీ కండువాలు కప్పారని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ముల్లరసూల్, షేక్ జబీర్ స్పష్టం చేశారు. వారు మాట్లాడుతూ 6వ వార్డు టీడీపీ ఇంచార్జ్ కేశప్ప కుమారుడు సురేంద్రతో పరిచయం ఉండటాన్ని ఆసరా చేసుకొని తమను ఆదివారం టీడీపీ మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ వద్దకు తీసుకెళ్లారన్నారు. అక్కడ బలవంతంగా తమకు టీడీపీ కండువాలు కప్పడంతో ఏమీ మాట్లాడలేకపోయామన్నారు. తాము వైఎస్సార్‌సీపీకి, ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డికి విధేయులుమని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వేరే పార్టీలోకి వెళ్లబోమని తేల్చిచెప్పారు. సోమవారం పాతగుంతకల్లులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు బి.సుంకప్పను కలిశారు. ఆయన సమక్షంలో తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈసందర్భంగా నాయకుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగనన్నను మరోమారు ఆదరించండి



30వ వార్డులో వృద్ధురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న సాయిప్రతాప్‌రెడ్డి

తాడిపత్రి అర్బన్: సంక్షేమ పథకాల అమలు చేస్తూ మరో వైపు రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను మరోమారు ఆదరించాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు, యువ నాయకుడు కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని 30వ వార్డులో సోమవారం ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి నవరత్నాల ద్వారా ఆయా కుటుంబాలకు జరిగిన లబ్ధిని వివరించారు. సంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలపై ఆరా తీశారు. తాగునీరు సక్రమంగా సరఫరా అవుతోందా లేదా అని వాకబు చేశారు. వృద్ధులను ఆప్యాయంగా పలకరించారు. ప్రతి నెలా ఒకటో తేదీన సూర్యుడు ఉదయించకముందే వలంటీర్ వచ్చి తమకు పింఛన్లు అందజేస్తున్నారని వృద్ధులు సంతోషం వ్యక్తం చేశారు. సాయిప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్‌గుర్తుకు ఓటు వేసి జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. పట్టణ కన్వీనర్ జావిద్‌ఖాద్రీ, విద్యార్థి విభాగం అధ్యక్షుడు మనోజ్, నాయకులు సూర్యప్రభాకర్‌బాబు పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: ఎమ్మెల్యే తనయుడు కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి సోమవారం చుక్కలూరు గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. టీడీపీ హయాంలో పింఛన్లు తదితర వాటికి ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. మరోసారి వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మేరీ, సీనియర్ నాయకులు ఆలూరు రామేశ్వరరెడ్డి, కన్వీనర్ పల్లె నాగేశ్వరరెడ్డి, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ ఓబుల రెడ్డి, వైస్ సర్పంచ్ శ్రీరంగ, విశ్వనాథ్, విజయకాంత్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, హోటల్ ఆచారి, జే రామక్రిష్ణ, రాజారాం, వేణు, యలప్ప, బాలచంద్ర, రామచంద్ర, భాస్కర్ పాల్గొన్నారు.

శాస్త్రీయ పరిష్కారాలు కనుక్కోవాలి

• జిల్లా విద్యాశాఖ అధికారి నాగరాజు



వర్క్‌షాపులో పాల్గొన్న విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యార్థులు అటల్ ల్యాబ్స్‌ను పూర్తి స్థాయిలో వినియోగించుకుని స్థానికంగా గుర్తించిన సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలను కనుక్కోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి వి.నాగరాజు సూచించారు. స్థానిక నంబర్–2 ప్రభుత్వ పాఠశాలలో టింకరింగ్ ల్యాబ్స్‌పై విజ్ఞాన ఆశ్రమం, యూనిసెఫ్ సౌజన్యంతో మూడు రోజుల వర్క్‌షాపు సోమవారం ప్రారంభమైంది. వర్క్‌షాపును డీఈఓ నాగరాజు ప్రారంభించారు. గార్లదిన్నె, పామిడి, రాప్తాడు మోడల్ పాఠశాలలకు చెందిన 25 మంది విద్యార్థులు, కురుగుంట అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు చెందిన 10 మంది విద్యార్థులకు విజ్ఞాన్ ఆశ్రమానికి చెందిన మనోజ్, కృష్ణ సైన్స్‌కు చెందిన ప్రాజెక్టులను అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌లో ఎలా తయారు చేయాలో వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర యూనిసెఫ్ కోఆర్డినేటర్ సుదర్శన, జిల్లా సైన్స్ అధికారి బాలమురళీ కృష్ణ, ప్రధానోపాధ్యాయులు నవీదా, ఆయా పాఠశాలల నోడల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలకు చెక్



మాట్లాడుతున్న ఎంవీఐ రాజగోపాల్

యాడికి: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని తాడిపత్రి ఎంవీఐ(మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్) రాజగోపాల్ సూచించారు. సాగర్ సిమెంట్ కర్మాగారం వద్ద సోమవారం 35వ రహదారి భద్రతా వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కారు, జీపు, లారీ డ్రైవర్లతో సమావేశమై వారికి సూచనలు, సలహాలు ఇచ్చారు. అతివేగం, సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం, తాగి డ్రైవ్ చేయడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వంటి కారణాల వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్, కార్లలో వెళ్లేవారు సీటు బెల్టు ధరించాలని సూచించారు. అనంతరం సాగర్ సిమెంట్ వైద్య బృందంతో డ్రైవర్లకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సాగర్ సిమెంట్ యూనిట్ హెడ్ రంగారెడ్డి, మేనేజర్ నాగేశ్వర రావు, అసిస్టెంట్ మేనేజర్ శ్రీమన్నారాయణ, ఎస్‌ఓ వలి తదితరులు పాల్గొన్నారు.

దోమల బెడద అరికట్టాలని ధర్నా



మున్సిపల్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

తాడిపత్రి అర్బన్: పట్టణంలో దోమల బెడదను నివారించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. పట్టణంలో దోమల బెడద తీవ్రంగా మారి ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. దోమలను అరికట్టాలని పలుమార్లు అధికారులను కోరినా స్పందన లేదన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడా కూడా ఫాగింగ్ చేయడం లేదని ఆరోపించారు. అండర్ డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందన్నారు. ఇప్పటికైనా స్పందించి దోమల నివారణలకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. నాగేంద్ర, రమణ, శ్రీనివాస్ యాదవ్, ఉమాగౌడ్, ప్రసాద్ నాయక్, నరసింహారెడ్డి, గంగరాజు, సంజన్న తదితరులు పాల్గొన్నారు.

పొలాలకు రోడ్డు వేసుకుంటే తప్పుడు రాతలా?

• పచ్చ మీడియాపై మండిపడ్డ ఉల్లికల్లు రైతులు



ఉల్లికల్లులో ఎంపీ నిధులతో వేసుకున్న మట్టి రోడ్డును చూపుతున్న రైతులు

శింగనమల: మండలంలోని ఉల్లికల్లు గ్రామంలో 150 ఎకరాల భూములకు వచ్చి వెళ్లేందుకు వీలుగా ఎంపీ నిధులతో రోడ్డు వేయించుకుంటే నిధులు స్వాహా అంటూ పచ్చ మీడియాలో వార్తలు రాశారని రైతులు మండిపడ్డారు. సోమవారం గ్రామ రైతులు సదరు రోడ్డు వద్దకు పాత్రికేయులను తీసుకెళ్లి వాస్తవాలను వివరించారు. ఎంపీ నిధులు రూ.10 లక్షలతో 1.25 కిలోమీటర్ల మేర రోడ్డు వేసుకున్నామన్నారు. అక్కడి నుంచి మరికొంత దూరం వరకు రైతులందరం కలిసి చందాలు వేసుకొని పొలాల వరకు రోడ్డు వేసుకున్నామన్నారు. అయితే పచ్చ మీడియాలో మాత్రం రోడ్డు వేయకుండా నిధులు స్వాహా చేశారని ఆరోపించడం ఎంతవరకు సమంజసమన్నారు. వీరికి ఈరోడ్డు కనిపించడం లేదా అని విమర్శించారు. పార్టీలకతీతంగా రోడ్డు వేసుకున్నామని, కొంత మంది తెలుగు తమ్ముళ్లు ఓర్వలేక పచ్చమీడియా ద్వారా ఆరోపణలు చేయిస్తున్నారని అన్నారు. విలేకరుల సమావేశంలో రైతులు పరంధామరెడ్డి, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

నేడు మడుగుపల్లి, ఎల్లుట్లలో ఎమ్మెల్యే పర్యటన

పుట్లూరు: మడుగుపల్లి, ఎల్లుట్ల గ్రామాల్లో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి మంగళవారం పర్యటించనున్నట్లు ఎంపీడీఓ యోగానందరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆర్‌బీకేలు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్కులు, గ్రామ సచివాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభిస్తారని తెలిపారు.

కమిషనర్ బాధ్యతల స్వీకరణ



గుంతకల్లు కమిషనర్ పి.వెంకటరమణయ్యకు స్వాగతం పలుకుతున్న అధికారులు

గుంతకల్లు: గుంతకల్లు మున్సిపల్ కమిషనర్‌గా నియమితులైన పి.వెంకటరమణయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడి కమిషనర్ మల్లికార్జునను ప్రొద్దుటూరుకు బదిలీ చేయగా అక్కడ కమిషనర్‌గా ఉన్న వెంకటరమణయ్యను గుంతకల్లు బదిలీ చేశారు. నూతన కమిషనర్‌కు మున్సిపల్ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. పట్టణాభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు మంజునాథ్‌రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

గుత్తి కోట క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డి

గుంతకల్లు: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో గుత్తి కోట సంరక్షణ సమితి ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆర్డీఓ వాకా శ్రీనివాసులురెడ్డి సోమవారం ఆవిష్కరించారు. గుత్తి కోట చారిత్రక నేపథ్యం కలిగిన ప్రాంతం కాబట్టి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ హరిప్రసాద్ యాదవ్, లాయర్లు చెన్నకేశవులు, కోరి చంద్రశేఖర్, శివప్రియ ఫౌండేషన్ ప్రతినిధులు శివా, రాజ్యాంగ అవగాహన వేదిక ప్రతినిధులు వేణుగోపాల్, సరస్వతి, ప్రాణదాత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి పరుశురామ్ పాల్గొన్నారు.

రేపు రామరాజుపల్లి, పాళ్యంలో ఎమ్మెల్యే పర్యటన

పామిడి: గుంతకల్లు ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి బుధవారం మండలంలోని రామరాజుపల్లి, పాళ్యంలో పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కే నారాయణరెడ్డి సోమవారం తెలిపారు.రామరాజుపల్లిలో తొలుత నూతన సచివాలయ భవనం, వైఎస్సార్ క్లినిక్, రైతుభరోసా కేంద్రాలను ప్రారంభిస్తారన్నారు. మధ్యాహ్నం పాళ్యంలోని వైఎస్సార్ క్లినిక్, సచివాలయ భవనం, విద్యుత్ సబ్ స్టేషన్ ఎమ్మెల్యే ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.

ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా లక్ష్మీప్రసాద్



లక్ష్మీప్రసాద్ (ఫైల్)



పుల్లయ్య (ఫైల్)

గుంతకల్లు: ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా లక్ష్మీప్రసాద్, జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్‌గా పుల్లయ్యను ఎంపిక చేసినట్లు రాష్ట్ర అధ్యక్షురాలు సీ.మంజుల సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. లక్ష్మీప్రసాద్ గుంతకల్లు మండలం మొలకలపెంట గ్రామంలోని జేడీ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. అదేవిధంగా పుల్లయ్య గుర్రబాడు ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్యం



ఇంటి వద్దనే వృద్ధురాలికి వైద్యం అందజేస్తున్న డాక్టర్ అప్పయ్య

యాడికి: గ్రామీణ ప్రజలకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా మెరుగైన వైద్యం అందిస్తున్నామని రాయలచెరువు పీహెచ్‌సీ వైద్యాధికారి అప్పయ్య అన్నారు. దైవాలమడుగు గ్రామంలో సోమవారం 55 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఇళ్ల వద్దకే వెళ్లి వృద్ధులకు బీపీ, షుగర్ పరీక్షలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ షబ్బీర్ బాషా పాల్గొన్నారు.

నేడు కసాపురంలో టెండర్లు

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకూ ఆలయంలో నిర్వహించే పలు పనులకు మంగళవారం ఉదయం 11గంటలకు టెండర్లు నిర్వహించనున్నట్లు ఈవో విజయ్ సాగర్ బాబు తెలిపారు. భక్తులు స్వామివారికి సమర్పించిన తలనీలాలు, కొబ్బరి చిప్పలు, వాహనాల టోల్‌గేట్, బియ్యం బేడల సేకరణ, శానిటేషన్, సెల్‌ఫోన్లు, కెమెరాలు భద్రపరచుట, వివిధ రకాల సరుకుల పంపిణీ తదితర పనులకు షీల్డు, ఈ టెండర్‌తోపాటు, బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేటి నుంచి కుష్టు వ్యాధి పక్షోత్సవాలు

గుత్తి రూరల్: గుత్తి డివిజన్ వ్యాప్తంగా మంగళవారం నుంచి కుష్టు వ్యాధి పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గుత్తి డివిజనల్ కుష్టు నియంత్రణ అధికారి వైద్యం వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. కాళ్లు, చేతి వేళ్లలో బలహీనత, కళ్లు మూసుకోవడంలో ఇబ్బంది, శరీరంపై స్పర్శలేని మచ్చలు, ఎరుపు రంగుతో కూడి ఉబ్బినట్టుగా ఉండే మచ్చలు, లావుగా, నొప్పిగా, నరాలకు జోము కలిగినట్టుగా ఉంటే అవి కుష్టు వ్యాధి లక్షణాలుగా గుర్తించాలన్నారు. మంగళవారం నుంచి ఫిబ్రవరి 13 వరకూ వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తారని, అలాంటి లక్షణాలు ఉన్నవారు పరీక్షలు చేయించుకొని వ్యాధి నిర్ధారణ అయితే చికిత్స చేయించుకోవాలని సూచించారు.

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో మంగళవారం నుంచి కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరయ్య పేర్కొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

గార్లదిన్నె: మండలంలో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, కేసుల పరిష్కారంపై ఆరా తీశారు. మండలంలో పేకాట, మట్కా పూర్తిగా అరికట్టాలని సిబ్బందిని ఆదేశించారు.

ఉత్తమ అధికారికి సన్మానం



నరేంద్రబాబును అభినందిస్తున్న ఎంఈఓలు

యాడికి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సీఆర్‌ఎంటీగా అవార్డు అందుకున్న సమగ్ర శిక్షణలో విధులు నిర్వహిస్తున్న నరేంద్రబాబును ఎంఈఓ కార్యాలయంలో సోమవారం ఘనంగా సన్మానించారు. సీఆర్‌ఎంటీలు ఓబులేసు, రామాంజనేయులు, శైలజ, విశ్వనాథ్, రామకృష్ణ, ఐఈఆర్‌పీ రంగస్వామి రెడ్డి పాల్గొన్నారు.